www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 26 మార్చి 2025
5
తిరుపతి



కార్మికులపై కక్షసాధింపు
స్విమ్స్ నర్సింగ్ సూపరింటెండెంట్ బదిలీ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో కార్మికులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడిన స్విమ్స్ నర్సింగ్ సూపరింటెండెంట్ ప్రభావతిని ఎట్టకేలకు బదిలీ చేశారు. దాదాపు 60 మంది కార్మికులను తొలగించిన ఆమెపై స్విమ్స్ డైరెక్టర్ రవికుమార్ విచారణ చేపట్టారు. కార్మిక నాయకులు రవి, ముత్తు, సూరిలు ఆమె చేసిన ఆగడాలపై కూలంకుషంగా డైరెక్టర్‌కు విన్నవించారు. ఆమెపై చర్యలు తీసుకోకపోవడంతో ఈ పంచాయతీ టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు వరకు వెళ్లింది. ఐదేళ్లు వైఎస్ఆర్ కాంగ్రెస్ హయాంలో చక్రం తిప్పుతూ కూటమి ప్రభుత్వంలోనూ స్విమ్స్‌లో ఆమె తిరుగులేకుండా వ్యవహరించడంతో వేధింపులకు బలైన కార్మికులు ఉన్నతస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. టిటిడి ఛైర్మన్ స్పందించి వెంటనే ఆమెను బదిలీ చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. పద్మావతి హాస్టల్లో డిప్యూటీ డైరెక్టర్‌గా ఆమె బదిలీ అయ్యారు. హాస్టల్‌కు మాత్రమే ఆమెను పరిమితం చేయడంపై కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ధర లేక... వేరే దారి లేక...

'ఆశ' చావక వీధివీధి తిరిగి అమ్ముకుంటున్న పుచ్చ రైతులు

• రోడ్లల్లో అమ్ముకుంటున్న అన్నదాత • రూ.7వేలకు పడిపోయిన టన్ను ధర

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

రైతన్న ఆరుగాలం శ్రమ అప్పుల పాలవుతోంది..'అమ్ముదాం అంటే అడవి.. కొందాం అంటే కొరివి" అన్న చందంగా మారింది. వాతావరణ పరిస్థితులు..ప్రకృతి విపత్తులను దాటి పంటలను సాగు చేస్తున్న రైతన్నలను స్థిరత్వం లేని మద్దతు ధరలు వెక్కిరిస్తున్నాయి. సాంప్రదాయ పంటల సాగులో వస్తున్న నష్టాలను వాణిజ్య పంటల్లోనైనా పూడ్చుకుందామనుకుంటున్న రైతన్న ఆశలు అడియాశలే అవుతున్నాయి. తూర్పున పుచ్చ పంటను సాగు చేస్తున్న రైతులకు మద్దతు ధర లేకపోవడంతో తూర్పున సూరీడు ఉదయించకముందే తానే వ్యాపారిగా మారి పల్లెలు, పట్టణాలు తిరిగి కాయలు అమ్ముకునే దుస్థితి నెలకొంది. వ్యాపారులు సిండి'కేటు'గా మారి మద్దతు ధరలు భారీగా తగ్గించేయడంతో రైతుకు దయనీయమైన పరిస్థితులు నెలకొనడం విచారకరం.

టన్ను రూ.7 వేలకు...

'సాంప్రదాయ పంటలు వద్దు.. వాణిజ్య పంటలే ముద్దు' అంటూ వ్యవసాయాధికారులు ఊదరగొడుతున్న మాట. అందుకుతగ్గట్లుగానే రైతులు సాంప్రదాయ పంటలు మాని వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలోనే తూర్పు మండలాల్లోని రైతులు పుచ్చ సాగుపై అమితాసక్తి కనబరిచారు. గత పదేళ్లుగా పుచ్చ సాగు చేసి తీపి ఫలితాలు చూసిన రైతులు ఈ సారి ఏకంగా రెండు వేల ఎకరాల్లో పుచ్చ సాగుకు ఉపక్రమించారు. అయితే ఇదే రైతులకు శాపంగా మారింది. దళారులు, వ్యాపారులు సిండి'కేటు' గా మారి ధరలు అమాంతం తగ్గించేశారు. ప్రస్తుతం రైతు వద్ద టన్ను పుచ్చకాయలను కేవలం రూ. 7 వేలకే కొంటున్నారు. మార్కెట్ లో కేజీ ధర రూ. 25గా ఉంటోంది. గతేడాది టన్ను ధర రూ. 18 వేల నుంచి రూ. 15 వేలు పలికింది. ఈ ఏడాది మద్దతు ధర అధ:పాతాళానికి పడిపోవడంతో రైతు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దీంతో విధిలేని పరిస్థితుల్లో రైతులు దళారులు నిర్ణయించిన ధరకు కాయలను అమ్ముకుంటుండగా , మరి కొందరు తామే కాయలను పట్టణాలు, పల్లెలకు తీసుకెళ్లి అమ్ముకుంటున్నారు. ఎకరా పొలంలో పుచ్చ సాగుకు పెట్టుబడి రూ.లక్ష దాకా అవుతోంది. అయితే ప్రస్తుతం ఉన్న మద్దతు ధర రీత్యా రైతుకు పెట్టుబడి ఖర్చు కూడా వచ్చే పరిస్థితి లేదు. వాణిజ్య పంటలు సాగు చేయాలని రైతులను సమాయత్తం చేస్తున్న పాలకులు, అధికారులు వాటికి మద్దతు ధరలు నిర్ణయించడంలో విఫలమవుతున్న పరిస్థితి. ఫలితంగా రైతులకే దుస్థితి నెలకొంటోంది. ఇకనైనా పాలకుల్లో చలనం వచ్చి ధరల స్థిరీకరణ, పంటలకు మద్దతు ధరపై దష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పెట్టుబడి కూడా రాదు:

వెంకటముని నాయుడు, రైతు, బోనుపల్లి

రెండు ఎకరాల్లో పుచ్చ సాగుకు రూ. 2 లక్షలు పెట్టుబడి ఖర్చు అయింది. దిగుబడి కేవలం 20 టన్నులు మాత్రమే వచ్చింది. వ్యాపారులు టన్ను కాయలను రూ.7 వేలకే కొంటున్నారు. దీంతో తామే పల్లెలు, పట్టణాలకు పోయి బాడుగ ట్రాక్టర్లు ఆటోలలో కాయలు అమ్ముకుంటున్నాం.

లా మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించాలి :ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - క్యాంపస్

న్యాయ విద్య మూడు సంవత్సరాల ఎల్.ఎల్.బి, ఐదు సంవత్సరాల ఎల్.ఎల్.బి, ఎల్ ఎల్ ఎం కోర్సులకు సంబంధించిన మొదటి సెమిస్టర్ పరీక్షలను వెంటనే నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఇన్చార్జ్ విసి ఆచార్య సిహెచ్ అప్పారావుకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ 2024- 2025 విద్యా సంవత్సరానికి గాను తరగతులు నవంబర్లో ప్రారంభమై ఇప్పటికే ఐదు నెలలు గడుస్తున్నా ఈ కోర్సులకు సంబంధించి ఇప్పటివరకు మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించలేదన్నారు. 2025 -2026 సంవత్సరాల సంబంధించినటువంటి ఏపీ లా సెట్ నోటిఫికేషన్ ఇచ్చారని, అయినా ఇప్పటివరకు 2024 -2025 సంవత్సరం మొదటి సెమిస్టర్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించకపోవడం వలన 2025- 2026 సంవత్సరానికి సంబంధించినటువంటి విద్యార్థుకు అకాడమిక్ ఇయర్ ఇబ్బందికరంగా మారుతుందని పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ తిరుపతి జిల్లా అధ్యక్షులు అక్బర్, సహాయ కార్యదర్శి అశోక్, వర్సిటీ అధ్యక్ష కార్యదర్శులు నరసన్న, వినోద్, నాయకులు నరేంద్ర, వీరేష్ పాల్గొన్నారు.

వీసీకి వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

టిటిడి ఛైర్మన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న టిటిడి ఉద్యోగులు

ఉద్యోగులకు దర్శనంపై .. టిటిడి ఎస్‌డబ్ల్యుఎఫ్ హర్షం

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల తిరుపతి దేవస్థానం లోని ఉద్యోగులకు ప్రతి మూడు నెలలకు ఓ మారు సిఫార్సు లేఖల ద్వారా దర్శనం చేయించాలన్న టీటీడీ బోర్డు నిర్ణయాన్ని తాము హర్షిస్తున్నామని టీటీడీ ఎస్ డబ్ల్యు ఎఫ్ (సీఐటీయూ)అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి. వెంకటరమణ, కాటా గుణశేఖర్, గౌరవాధ్యక్షులు జి. వెంకటేశంలు టీటీడీ ఛైర్మన్ కు ధన్యవాదాలు తెలియజేశారు.మంగళవారం సాయంత్రం తిరుమలలో టీటీడీ ఛైర్మన్ కార్యాలయంలో ఆయనను కలిసి టీటీడీలో నెలకొని ఉన్న వివిధ రకాల సమస్యలను పరిష్కరించమని కోరుతూ వినతి పత్రాన్ని సమర్పించారు.

టీటీడీ ఉద్యోగులు, పెన్షనర్స్ కు ఇంటి స్థలాల సమస్యను పరిష్కరించాలని, ఇచ్చిన స్థలాల వద్ద సౌకర్యాలు మెరుగుపరచాలని టిటిడి హెల్త్ ఫండ్ ను బలోపేతం చేయాలని, రియంబర్స్మెంట్ సౌకర్యాన్ని కొనసాగించాలని, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్స్ రిలీజ్ చేయాలని, ఐదేళ్లుగా పెండింగ్ లో ఉన్న ప్రమోషన్లను పూర్తి చేయాలని, రెండు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న కారుణ్య నియామకాలు భర్తీ చేయాలని, టీటీడీలో ఖాళీగా ఉన్న 8వేల పోస్టులు భర్తీ చేసి పని భారాన్ని తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. టిటిడి ఉద్యోగులు, పెన్షనర్లకు పిలిగ్రీం అలవెన్స్ గత రెండు పిఆర్సిలుగా పెంచలేదని దానిని 2500 నుంచి 5000 రూపాయలకు పెంచవలసిందిగా విజ్ఞప్తి చేశారు. టీటీడీ ఉద్యోగ సంఘ ఎన్నికలు నిర్వహించాలని వినపత్రంలో పేర్కొన్నారు. టిటిడిలో చెల్లిస్తున్న వివిధ అలవెన్సులు, యూనిఫామ్, రిస్క్ అలవెన్సు, పెంచాలని టిటిడిలో ఆఫీస్ సబార్డినేట్స్ కు పెరిగిన పనిబారాన్ని తగ్గించాలని, వివిధ డిపార్ట్మెంట్లోని ఉద్యోగులకు కన్వర్షన్ ను అమలు చేయాలని, పదవి విరమణ పొందుతున్న వారికి టీటీడీ యాజమాన్యం సత్కరించే సాంప్రదాయాన్ని పునరుద్ధరించాలని, టీటీడీ ఔట్సోర్సింగ్, కార్పొరేషన్, సొసైటీ లలో పనిచేస్తున్న కార్మికులకు టైం స్కేల్ అమలు చేయాలని కోరారు. టీటీడీలో హాస్టల్ ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. టీటీడీ క్యాంటీన్ విభాగంలో సూపర్వైజర్ పోస్ట్ లు,ఏసి ఓ పోస్టులు అప్ గ్రేడ్ పద్ధతిలో క్రియేట్ చేయాలని కోరారు. టిటిడి ఎంప్లాయిస్ క్వార్టర్స్ ను ఆధునికరించాలని విజ్ఞప్తి చేశారు. టిటిడి కళ్యాణ మండపాల్లో ఉద్యోగులకు 80శాతం రాయితీ ఇచ్చి కాషన్ డిపాజిట్ ఉద్యోగులకు మినహాయించాలని ఆ వినతి పత్రంలో ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఉద్యోగ కార్మిక సంఘాల నాయకులు పద్మనాభం, దయాకర్, శ్రీలక్ష్మి, ఆదిలక్ష్మి, హనుమంత రెడ్డి వేణు, ఆవుల నరేష్, పయ్యావుల రాజశేఖర్, ధారా రవికుమార్ పాల్గొన్నారు.

దళితవాడ తాగునీటి సమస్య వివరిస్తున్న స్థానికులు

ఊరికి 'దిష్టి'... తిమ్మాయిగుంట వాటర్ ట్యాంక్

9 ఏళ్లుగా ప్రారంభానికి నోచని వైనం
'ప్రజాచైతన్య యాత్ర'లో వెలుగులోకి..

ప్రజాశక్తి - రేణిగుంట

రేణిగుంట మండలం వెంకటాపురం పంచాయతీకి చెందిన తిమ్మయ్య గుంట దళితవాడలో మంగళవారం సిపిఎం "ప్రజా చైతన్య యాత్ర పర్యటన" సాగింది. గ్రామానికి స్మశాన స్థలం లేకపోవడంతో డ్రైనేజీ కాల్వలో మృతదేహాలను పూడ్చుతున్నామన్నారు. పెళ్లయిన జంటలకు కొత్తగా రేషన్‌కార్డులు మంజూరు చేయాలన్నారు. కుర్రకాల్వ అడుసుపాలెం వద్ద ఇచ్చిన పట్టాలకు స్థలం ఎక్కడుందో రెవెన్యూ అధికారులు చూపడం లేదన్నారు. సిపిఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ కొండ్రెడ్డి హరినాథ్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై 27వ తేదీ రేణిగుంట తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేయనున్నట్లు చెప్పారు.

శ్రీకాళహస్తి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బొజ్జల గోపాలకష్ణారెడ్డి తిమ్మయ్యగుంట అరుంధతి వాడ స్థానిక ప్రజల కోరిక మేరకు త్రాగునీటి సరఫరా చేసే వాటర్ ట్యాంక్ 20 లక్షల లీటర్లు నీళ్ల కెపాసిటీ కలిగి, గ్రాంటు ఎన్ఆర్డి డబ్ల్యు పి క్రింద 15.50 లక్షలతో 9 సంవత్సరాల ముందు నిర్మించినా, ఇంతవరకు ప్రారంభానికి నోచుకోక పోవడం స్థానిక ప్రజలు చెప్పుంటే వినేవారికి ఆశ్చర్యం కలిగిస్తున్నది. స్థానిక ప్రజలకు ట్యాంకు ద్వారా తాగునీరు రావడంలేదని.. ప్రజలకు ఉపయోగపడవలసిన నిధులు దుర్వినియోగం తప్ప.. స్థానిక గ్రామ ప్రజలకు ఉపయోగం లేని ఈ వాటర్ ట్యాంక్ పేరుకే ఉందని,ఇది గ్రామానికి దిష్టిబొమ్మలా ఉందని అభివర్ణించారు. ఇప్పటికైనా బొజ్జల గోపాలకష్ణారెడ్డి తనయుడు ప్రస్తుత శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి వెంటనే తిమ్మయ్య గుంట దళితవాడకు విచ్చేసి వాటర్ ట్యాంక్‌కు శిలాఫలకం వేసి ప్రారంభిస్తే, ఇంటింటికి తాగునీళ్లు వస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఈశ్వరమ్మ, శ్రీనివాసులు, భారతి, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

వెంకటగిరి ఆస్పత్రిలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్

వెంకటగిరి ఆస్పత్రిలో పోస్టులు ఖాళీగా ఉండటం వల్ల రోగులకు పూర్తిస్థాయి వైద్యం అందడం లేదని, ఏదైనా యాక్సిడెంట్ జరిగిందంటే వెంటనే తిరుపతికి రిఫర్ చేయాల్సి వస్తోందని సిపిఎం నియోజకవర్గ కన్వీనర్ వడ్డిపల్లి చెంగయ్య పేర్కొన్నారు. 'ప్రజాచైతన్య యాత్రలో' భాగంగా మంగళవారం ప్రభుత్వ ఆస్పత్రిని ఆయన సందర్శించారు. డాక్టర్ల కొరత ఉందని, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు రెండు, తోటి ఒకటి పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. యాక్సిడెంట్ కేసులకు పూర్తిస్థాయి వైద్యం అందించేలా ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేసి నిపుణులను నియమించాలన్నారు. సిటీస్కాన్ ఏర్పాటు చేయాలన్నారు. సౌకర్యాలు లేకపోవడం వల్ల తిరుపతి, నెల్లూరు, గూడూరులకు రెఫర్ చేస్తున్నారన్నారు. 30 పడకల ఆస్పత్రిగా ఉన్న వెంకటగిరిని వంద పడకలకు పెంచాలన్నారు. ఈ ప్రాంతంలో దాదాపు 150 మంది డయాలసిస్ పేషంట్లు ఉన్నారని, డయాలసిస్ యూనిట్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఎంవి రమణయ్య, వ్యకాసం నాయకులు నారాయణ, రాజయ్య, ఏకలవ్య ఎరుకుల సంక్షేమ సంఘం నాయకులు నవీన్, చందు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో సౌకర్యాలను పరిశీలిస్తూ...

సామాజికవేత్త శోభారాణికి గ్లోబల్ పీస్ పురస్కారం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

జర్మనీకి చెందిన ఇంటర్ నేషనల్ పీస్ యూనివర్సిటీ వారు ఈ నెల 23న పాండిచ్చేరి లో నిర్వహించిన సెమినార్ లో తిరుపతికి చెందిన మూవీ ఆర్టిస్ట్, సామాజిక వేత్త బి. శోభారాణికి పురస్కారం అందజేసారు. తిరుపతికి చెందిన శోభారాణి పలు సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ సినీ, టివి రంగాలలో నటి గా గుర్తింపు పొందారు. ఆమె చేసిన సామాజిక సేవలకు గుర్తుగా ఆమెను ఇంటర్ నేషనల్ పీస్ యూనివర్సిటీ వారు గౌరవ పురస్కారం అందచేసారు.

వేడుకగా మెట్లోత్సవం

ప్రజాశక్తి - తిరుమల టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యుల 522వ వర్ధంతి మహోత్సవాలలో భాగంగా సోమవారం ఉదయం అలిపిరి పాదాలమండపం మెట్లోత్సవం వైభవంగా జరిగింది. మెట్లోత్సవంలో పాల్గొనడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని ప్రాజెక్టు సంచాలకులు రాజగోపాలరావు అన్నారు. భజనమండళ్ల గోవింద నామస్మరణతో నడకమార్గం మార్మోగింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన దాదాపు 700 మందికిపైగా భజనమండళ్ల సభ్యులు భజనలు చేసుకుంటూ తిరుమలకు చేరుకున్నారు.

టీటీడీకి రూ.10.11 లక్షలు విరాళం

ప్రజాశక్తి - తిరుమల

మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్ నగరానికి చెందిన గౌరవ్ ఐరెన్ అనే భక్తుడు మంగళవారం శ్రీవేంకటేశ్వర సర్వ శ్రేయస్ ట్రస్టుకు రూ.10,11,111 విరాళంగా అందించారు. ఈ డిడిని ఛైర్మన్ బిఆర్ నాయుడుకు అందజేశారు.

కోర్టు ఎదుట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

పుత్తూరులో న్యాయవాదుల ధర్నా

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

న్యాయవాదులపై దాడులు అమానుషమని పుత్తూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా జరిగింది. హైదరాబాద్ న్యాయవాది ఇజ్రాయిల్‌పై దాడిచేసి, హత్యచేసినందుకు మంగళవారం విధులు బహిష్కరించి ధర్నా, ర్యాలీ నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.పురుషోత్తం, కార్యదర్శి మురళిరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు న్యాయసేవలు అందించి, చట్టాలను కాపాడే న్యాయవాదులపై దాడులు అమానుషమని అన్నారు. సంఘటనకు బాధ్యులపై చర్యలు తీసుకుని, న్యాయవాదులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శేషాచలం, ఎం.సంజీవి, నరేంద్రకుమార్, గాలి రమేష్, రాజేష్, గాలి సురేష్, కేజీ ప్రభాకర్ పాల్గొన్నారు.

తల్లీబిడ్డ ఎక్స్ ప్రెస్ డ్రైవర్లకు రూ.26వేలివ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, నగర కార్యదర్శి వేణుగోపాల్ డిమాండ్ చేశారు. ప్రసూతి ఆస్పత్రి వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కందారపు మురళి మాట్లాడుతూ ప్రసూతి ఆస్పత్రిలో కాన్పు అయిన తరువాత డిశ్చార్జి చేసిన వారిని వారివారి ఇళ్ల వద్ద సురక్షితంగా తీసుకెళుతున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలన్నారు. డ్రైవర్ల అందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, మార్చి 31వ తేదీ అరబిందో సంస్థ కాంట్రాక్ట్ రద్దు కావడంతో మరో కాంట్రాక్ట్ వస్తే పాత ఎంప్లాయిస్‌ను కొనసాగించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఇచ్చే రూ.7850 జీతంతో ఎలా బతుకుతారని ప్రశ్నించారు. పిఎఫ్ ఇవ్వాలని, వాహనాల మరమ్మతు ప్రభుత్వం చేయించాలని, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ డ్రైవర్లు విశ్వనాథ రెడ్డి, నవీన్, ఉమాపతి, హరిప్రసాద్, భరత్ రెడ్డి, వెంకటాద్రి, రమేష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న జిబిఎస్ మణ్యం

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

దశాబ్దాల తరబడి, ప్రాణాలకు తెగించి పని చేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయ్యాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జి. బాల సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం రెండో రోజుకు చేరుకుంది. తిరుపతి కేశవాయనగుంటలోని ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం ముందు ఏర్పాటుచేసిన దీక్ష శిబిరాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కార్మికుల రిలే నిరాహార దీక్ష జయప్రదం కావాలని, దశాబ్దాల కాలంగా ప్రాణాలను సైతం పోగొట్టుకుంటూ, సంస్థను నమ్ముకుని పనిచేస్తున్నారని, వారిని రెగ్యులర చేయాలన్నారు. వాచ్మెన్‌గా 15 సంవత్సరాల పని చేసి, ప్రమోషన్ మీద షిఫ్ట్ ఆపరేటర్ అయినటువంటి వారికి, తగ్గించిన జీతాన్ని వెంటనే పెంచాలని,16 నెలల అరియర్స్ అమౌంట్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. తిరుపతి జిల్లా బిల్డింగ్ యూనియన్ కార్యదర్శి ముని రాజా, విద్యుత్ కాంట్రాక్ట్ యూనియన్ కడప జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ అధికారుల చుట్టూ ప్రభుత్వం చుట్టూ తిరిగి తిరిగి విసిగిపోయిన కాంట్రాక్ట్ కార్మికులు ఉద్యమమే ప్రధానమని రిలే దీక్షకు దిగారన్నారు. ఏప్రిల్ ఏడో తారీఖున మహాధర్నా చేస్తూ ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శివప్రసాద్ రెడ్డి , రవి, ఆరోగ్యదాసు, గుణ, గజ ,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో కంచి పీఠాధిపతి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి మంగళవారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. ఆయనకు ఆలయ ఈవో బాపిరెడ్డి సాంప్రదాయ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేద పండితులు ఆశీర్వచనాలు పలికారు. ఈవో ముక్కంటి తీర్థ ప్రసాదాలు, జ్ఞాపకాలు అందజేశారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతిని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు.

'శ్రీజ' ఉద్యోగులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

శ్రీజ పాల సంస్థలో పనిచేస్తున్న 560 మంది ఉద్యోగులకు ట్రాఫిక్‌లో రాంగ్‌రూట్‌లో వెళ్లడం వల్ల కలిగే నష్టాలపై 'ప్రజల భద్రతే మా బాధ్యత' అనే నినాదంతో అవగాహనా సదస్సు నిర్వహించారు. లా అండ్ ఆర్డర్ ఎఎస్‌పి రవి మనోహరాచారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించి తోటివారికి ఆదర్శంగా నిలవాలన్నారు. ప్రతి ఒక్కరికీ రాంగ్‌రూట్‌లో వెళ్లడం పరిపాటిగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డిఎస్‌పి రామకృష్ణ ఆచారి, ఇన్‌స్పెక్టర్లు సుబ్బారెడ్డి, సంజీవ్‌కుమార్, శ్రీజ సిఎంఒ తిమ్మప్ప పాల్గొన్నారు.

స్పోర్ట్స్ హబ్‌గా తిరుపతి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

అమరావతిలో అతిపెద్ద అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఈ క్రమంలో మరో ముఖ్య పట్టణమైన తిరుపతిని స్పోర్ట్స్ హబ్‌గా మార్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా స్పోర్ట్స్ గ్రౌండ్లు, మౌలిక సదుపాయాల ఏర్పాటు కోసం చర్యలు చేపట్టారు. తిరుపతిలోని గొల్లవానిగుంటలో స్మార్ట్‌సిటీ నిధులతో నిర్మించిన క్రికెట్ స్టేడియంను శాప్ ఆధీనంలోకి తీసుకుంది. ఈ స్టేడియాన్ని పూర్తి స్థాయిలో అభివద్ధి చేసి, ఆటగాళ్లకు ప్రాక్టీస్, మ్యాచ్‌ల నిర్వహణకు అనువుగా తీర్చిదిద్దుతున్నారు. తిరుపతిలో ఇప్పటికే ఉన్న శ్రీశ్రీనివాస క్రీడా సముదాయానికి అనుసంధానంగా కొత్త క్రికెట్ స్టేడియాన్ని అభివద్ధి చేయబోతున్నారు. అంతేకాదు ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌నుఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటివరకు తిరుపతిలో క్రికెట్ టోర్నీలు, ప్రాక్టీస్‌లు ఎస్వీయూ తారకరామ మైదానం వద్దే నిర్వహించేవారు. కానీ కొత్తగా అభివద్ధి చేస్తున్న స్టేడియంతో ఆటగాళ్లకు మరింత విస్తత స్థాయిలో సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. ఈ ప్రయత్నంలో శాప్ ఛైర్మన్ రవి నాయుడు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్, కమిషనర్ మౌర్యతో చర్చించి, స్టేడియంను శాప్ ఆధీనంలోకి తీసుకునేలా ఒప్పించారు. ప్రస్తుతం ఈ స్టేడియంలో పలు అభివద్ధి పనులు కొనసాగుతున్నాయి. స్టేడియంలో 65 మంది సీటింగ్ సామర్థ్యం కలిగిన పెవిలియన్, 315 మంది సామర్థ్యం గల గ్యాలరీ నిర్మాణ దశలో ఉంది. రూ.6 కోట్ల నిధుల్లో రూ.4.5 కోట్ల పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. గొల్లవానిగుంటలో సమీకత క్రీడా సముదాయం నిర్మాణానికి అదనంగా రూ.2 కోట్ల ప్రతిపాదనను సిద్ధం చేశారు. పూర్తి స్థాయిలో అభివద్ధి పూర్తయిన తర్వాత, ఈ స్టేడియంలో రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి టోర్నీలు నిర్వహించేందుకు అవకాశాలు మెరుగుపడనున్నాయి. ఈ అభివద్ధితో తిరుపతి క్రీడా హబ్‌గా మారబోతోందని క్రీడా ప్రియులు ఆశిస్తున్నారు.

రాజ్యాంగ పరిరక్షణ ప్రచార జాతాను విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : భారత రాజ్యాంగ పరిరక్షణకై సిపిఐ చేపట్టిన కార్యక్రమం విజయవంతం కోసం జిల్లా పార్టీ కృషి చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాథ్ రెడ్డి తెలియజేశారు. స్థానిక బైరాగి పట్టెడ సిపిఐ కార్యాలయంలో సీపీఐ జిల్లా స్థాయి విస్తృత సమావేశం ఎం.రామకృష్ణ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీరనాద్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగానికి భద్రత లేకుండా పోయిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న సీపీఐ ప్రచార జాతాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి మాట్లాడుతూ సీపీఐ ప్రచార జాతాలో భాగంగా 27న తిరుపతిలో సాయంత్రం 4 గంటలకు జరిగే ప్రదర్శనలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశం లో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ రామానాయుడు, ఎ ఐ టి యు సి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చంద్ర శేఖర్ రెడ్డి, కె రాధాకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, జె విశ్వనాథ్, కత్తి రవి, చిన్నిరాజ్, సుధాకర్ రెడ్డి , బండి చలపతి, ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

సమావేశంలో ప్రసంగిస్తున్న డిఈ దేవ ఆశీర్వాదం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : విద్యుత్ వినియోగదారులు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పుత్తూరు విద్యుత్ శాఖ డివిజన్ అధికారి దేవ ఆశీర్వాదం కోరారు. సూపర్ ఇంటెండింగ్ ఇంజనీర్ ఆపరేషన్ సర్కిల్ తిరుపతి వారి ఆదేశాల మేరకు పుత్తూరు డివిజన్‌లోని 6 విద్యుత్ ఉప కేంద్రాల వద్ద వినియోగదారుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న డివిజన్ అధికారి మాట్లాడుతూ సూర్య ఘర్ పథకం వినాయోగదారులకు సబ్సిడీతో అందిస్తున్నారని తెలిపారు. విద్యుత్ బిల్లు ఆదా చేసుకునే సదవకాశమని తెలిపారు. ఈకార్యక్రమంలో ఏడిఈ శంకరయ్య, రమేష్, ఏఈలు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్ ఏపీ ఎస్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణకు కూటమి నేతల యత్నం

తిరుచానూరులో ఇరుగ్రూపుల మధ్య ఘర్షణ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కోర్టు వివాదాల్లో ఉన్న భూమిని ఎలాగైనా సొంతం చేసుకోవాలని తమదైన శైలిలో అన్ని సమకూర్చుకున్న కూటమి నేతలు భూ ఆక్రమణలకు బరితెగించారు. అధికార పార్టీ వారమని, ఏమి చేసినా చెల్లుబాటు అవుతుందనే దురుద్దేశంతో అడ్డు వచ్చిన దళితులపై పిడి గుద్దులతో దాడులకు తెగబడ్డారు. ఈ దారుణం తిరుచానూరు గ్రామపంచాయతీ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానిక వివరాల మేరకు తిరుచానూరు పొక్కాలమ్మ ఆలయం వీధిలో గ్రామపంచాయతీ లెక్క దాఖలా సర్వే నెంబరు 398/12 లో ఉన్న భూమి వివాదాల కారణంగా రెండు వర్గాల మధ్య కోర్టు కేసులలో ఉంది. అయితే సదరు భూమిని ఎలాగైనా సొంతం చేసుకోవాలని తిరుచానూరు గ్రామపంచాయతీకి చెందిన అధికార పార్టీ నేత పోలీసుల అండదండలతో తన సైన్యాన్ని తీసుకొని 2022లో సదరు భూమిని కొనుగోలు చేసిన ఎస్సీ వర్గీయులపై దౌర్జన్యానికి దిగాడు. ఘర్షణ వాతావరణం నెలకొన్న సమయంలో పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టాల్సింది పోయి, అధికార పార్టీ వైపు నిలబడిపోయారన్న విమర్శలు స్థానికంగా వినిపించాయి. ఈ ఘటనపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని బాధితులు విజ్ఞప్తి చేశారు.

ఇకపై అభివృద్ధి పనులు షురూ : ఎమ్మెల్యే బొజ్జల

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఇకపై అభివృద్ధి పనులు పరుగులు పెట్టనున్నాయని స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అన్నారు. అందుకు అవసరమైన నిధులను అసెంబ్లీ సాక్షిగా ప్రస్తావించి మంజూరయ్యేలా కృషి చేసినట్లు తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ భవన్లో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మంగళవారం కార్యకర్తలతో సమావేశయ్యారు. గ్రామాలను పట్టణాలను అభివృద్ధి చేసే విధంగా పలు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. స్కిట్ ఇంజినీరింగ్ కళాశాల జేఎన్టీయూలో విలీనం చేసే విధంగా ప్రక్రియ ప్రారంభమైందని, వచ్చే విద్యా సంవత్సరంలో ఇంజనీరింగ్ అడ్మిషన్లు ప్రారంభమవుతాయని వెల్లడించారు. మార్చి నెలాఖరకు నామినేటెడ్ పదవులు లభిస్తాయని, కార్యకర్తలకు న్యాయం చేస్తామన్నారు. గ్రామాల్లో ఇంటి స్థలాలను క్రమబద్ధీకరించుకోవాలని కోరారు. రాజీవ్ నగర్లో రెవెన్యూ ఎంక్వైరీ పూర్తయిందని, అక్కడ ఒక వైసీపీ నాయకుడికి 24 ఇంటి పట్టాలు ఉన్నాయని, వాటి ప్రక్షాళన రెవెన్యూ అధికారులు చేస్తారన్నారు. అనంతరం సభ్యత్వాల నమోదులో విశేష ప్రతిభ చూపిన కార్యకర్తలకు గుర్తింపు కార్డులు, ప్రోత్సాహకాలను అందించారు. ఈ కార్యక్రమంలో విజయ్ కుమార్, చెంచయ్య నాయుడు, మునిరాజా నాయుడు, కామేష్ యాదవ్, గాలి మురళి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించండి

ప్రజాశక్తి -రేణిగుంట: తిరుపతి జిల్లా రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రేణిగుంట-3 గ్రామ సచివాలయం ఆరోగ్య చికిత్స కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందజేయాలని డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ కార్యక్రమం అధికారి డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు.రేణిగుంట మండల పీహెచ్సీ పరిధిలోని రేణిగుంట-3లో గల ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించారు. గ్రామంలో గర్భవతులకు వైద్య పరీక్షలు చేయించారు. గర్భధారణ-సంరక్షణ, ప్రసవం తర్వాత తల్లిబిడ్డ సంరక్షణ, యుక్త వయస్సు లో జాగ్రత్తలు, సాంక్రమిక, అసాంక్రమిక వ్యాధులు జీవనశైలి,కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వారి కోసం అమలు చేస్తున్న ప్రధానమంత్రి సురక్షిత్ మాతత్వ అభియాన్, ప్రధానమంత్రి మాతత్వ వందనయోజన, జనని ఆరోగ్య సురక్ష వంటి వివిధ రకాల ఆరోగ్య పథకాలను వివరించారు. అనంతరం వైద్య సిబ్బందితో సమీక్షించారు. డాక్టర్ ఛత్రప్రకాష్ రెడ్డి, స్టాటిస్టికల్ ఆఫీసర్ నాగేంద్ర కుమార్, డిపిఒ ప్రకాష్ పాల్గొన్నారు.

అల్లుడు కోసం.. చీటీల డబ్బుతో అత్త పరార్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్న అల్లుడ్ని కాపాడుకునేందుకు చీటీల డబ్బుతో అత్త పరారైన ఘటన తిరుపతిలో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జబ్బార్ లేఔట్‌లో అమ్ములు అలియాస్ లత టిఫిన్ అంగడి నడుపుతూ జీవనం సాగిస్తుంది. ఈ నేపథ్యంలో చుట్టూ ఉన్న మహిళలతో చీటీల నిర్వహించేది. సుమారు 50 లక్షల రూపాయలు వసూలు చేసి ఉడాయించింది. మేము మోస పోయామని బాధితులు ఈస్ట్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మహేష్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. అమ్ములు అల్లుడు శివానంద్ నెల్లూరులో ఒక గవర్నమెంట్ స్కూల్ టీచర్‌గా పని చేస్తూ, ఆన్లైన్ బెట్టింగులకు అలవాటు పడి, డబ్బు పోగొట్టుకుని అప్పుల పాలయ్యాడు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న అల్లుడుని కాపాడుకునేందుకు ఈ చీటీ డబ్బులు వాడుకున్నట్టు మోసపోయిన వారు అనుమానం వ్యక్తం చేశారు. ఆమె నెల్లూరులో ఉన్న అల్లుడు శివానంద దగ్గరకు పరారైందని బాధితులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముత్యాలమ్మ జాతర ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - చిల్లకూరు: ముత్యాలమ్మ జాతర మంగళ వారం ప్రారంభ మైంది. ఈ రోజు రాత్రి అమ్మవారి నిలుపు కార్యక్రమం జరుగనుంది. జాతర ఏర్పాట్లను గూడూరు డివిజన్ సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా స్వయంగా పరిశీలించారు. భక్తులకు ఇబ్బంది లేకుంటా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

రుయాలో అంధులంటే అలుసా..!

- 'సదరన్' కేంద్రంలో ఉక్కపోత
- గంటల తరబడి వికలాంగుల నిరీక్షణ

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: ముందే అంధులు.. చీకటి తప్ప వెలుతురు చూసి ఎరుగరు. చుట్టు పక్కల పరిస్థితులు ఎలా ఉన్నాయి. ఏమి జరుగుతుంది, కనీసం ఏముందో కూడా తెలియని చీకటి బాధితులు. అందుకేనేమో వీరంటే రుయా సిబ్బందికి, అధికారులకు అలుసులా ఉంది.. సదరన్ సర్టిఫికెట్ కోసం వచ్చే అంధులకు, వికలాంగులకు వేసవి వెతలు తప్పడం లేదు. ప్రాథమిక పరీక్షా కేంద్రాల వద్ద కనీసం ఫ్యాన్ కూడా ఏర్పాటు చేయకపోవడంతో, ఉక్కపోతలో గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి. అంధులను పట్టించుకోని సిబ్బంది, అధికారులు వారి సీట్ల వద్ద మాత్రం ఫ్యాన్లు పెట్టించుకుని వీరిని విస్మరించడం గమనార్హం.అంధులు, చేయి, కాలు, ఇతర అవయవాలు లోపాలు గల వికలాంగులు, మానసిక వికలాంగులు, చెవిటి, మూగ బాధితులు ప్రభుత్వ భరోసా కోసం ఎదురుచూస్తూ ఉంటారు. అందు కోసం ధ్రువీకరణ పత్రాల కోసం ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తుంటారు. అక్కడ వైద్య నిపుణులు తమకున్న లోపాన్ని పేపర్‌పై ధృవీకరించి, సర్టిఫికెట్ రూపంలో ఇస్తే, దాని ద్వారా ప్రభుత్వం ఇచ్చే పెన్షన్ వల్ల తమ జీవితానికి కొంత ఊరట నిస్తుందని భావించి, ఆ పెన్షన్ కోసం ఎదురు చూస్తారు. ప్రభుత్వం వికలాంగుల కోటాలో పెన్షన్ ఇవ్వాలంటే వారి వారి అవిటితనం (అవయవలోపం) శాతాన్ని నిర్ధారించి, ప్రభుత్వ వైద్యులు సర్టిఫికెట్ తప్పని సరి. దాని కోసం వికలాంగులు, అంధులు ప్రభుత్వ ఆసుపత్రులకు రావడం పరిపాటే. రాయలసీమలో పేదల పెద్ద ఆసుపత్రిగా పేరుగడించిన తిరుపతి రుయాకు వారి తాకిడి అధికంగానే ఉంటుంది. వారంలో మూడు రోజులు బుధ, గురు, శుక్ర వారాల్లో వికలాంగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, సర్టిఫికెట్లు అందిజేస్తారు. నెల్లూరు, మదనపల్లి, చిత్తూరు ప్రాంతాల నుంచి దానికి సంబంధించిన వైద్యులను నియమిస్తారు. రోజు కనీసం నాలుగైదు వందల మది రోగులు ఈ సర్టిఫికెట్ కోసం వస్తుంటారు. దీనికి రుయా పరిపాలన భవనం మిద్దెపైన ఆప్తామాలజీ, ఇఎన్‌టి, ఆర్థో తదితర వార్డుల్లో వైద్య పరీక్షలు నిర్వహిస్తుంటారు. పరిపాలన భవనం మొదటి అంతస్తులో మెట్ల వద్ద విజన్ రూమ్‌లో అంధులకు కంటి పరీక్షలు చేస్తారు. కానీ అక్కడ కనీసం ఫ్యాన్లు ఏర్పాటు చేయకపోవడం, అంధులు ఉక్కపోతలో నిరీక్షించడం తప్పడం లేదు. అంధులు కావడంతో అక్కడ నుంచి పక్కకు వెళ్లేందుకు అవకాశం ఉండదు. విపరీతమైన ఉష్ణోగ్రతలు, రోజు రోజుకు పెరుగుతున్న ఎండ తీవ్రత వల్ల అంధులు, వికలాంగులకు అవస్థలు తప్పడం లేదు. సర్టిఫికెట్, ప్రాథమిక వైద్య పరీక్షల కోసం ఒక్కొకరు కనీసం రెండు గంటలకు పైగా వేచి ఉండాల్సి పరిస్థితి. ఈ స్థితిలో చెమటలు పోస్తున్నా తప్పనిసరి పరిస్థితుల్లో అక్కడే వేచి ఉండాల్సిన పరిస్థితి. పరీక్షలు నిర్వహించే, వైద్య సిబ్బంది, అధికారులు మాత్రం చల్లగా ఫ్యాన్ల కింద కుర్చోని, రోగులను విస్మరించడం శోచనీయం. రుయా అధికారులు స్పందించి సదరన్ సర్టిఫికెట్ కోసం వచ్చే రోగులకు ఫ్యాన్లు ఏర్పాటు చేసి, తాగేందుకు సమీపంలోనే మంచినీటిని ఏర్పాటు చేసి, ఆదుకోవాలని పలువురు రోగులు కోరుతున్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం..!

ఉక్కకు తట్టుకోలేక పోతున్నాం

తాను పుట్టగుడ్డివాడిని, సర్టిఫికెట్ రెన్యువల్ కోసం అప్పుడప్పుడు రుయా ఆసుపత్రికి వస్తుంటాను. కంటి పరీక్షలు నిర్వహించే విజన్ రూమ్ వద్ద కనీసం ఒక ఫ్యాన్ కూడా లేకపోవడంతో ఎండల తీవ్రత వల్ల ఉక్కపోత తప్పడం లేదు. చెమటలో తడిచి, ముద్దవుతున్నా గంటల తరబడి నిరీక్షణ తప్పడం లేదు. అధికారులు స్పందించి, వైద్య పరీక్షల గది వద్ద కనీసం ఫ్యాన్లు ఏర్పాటు చేసి ఆదుకోవాలి.

-పి.సాయికుమార్, అంధుడు, కృష్ణాపురం, రేణిగుంట

క్రైం న్యూస్

వ్యక్తి అనుమానాస్పద మృతి

భార్య, స్నేహితుడిపై కేసు నమోదు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఓ వ్యక్తి అనుమానాస్పద మృతి చెందడంతో మృతుడు తల్లిదండ్రులు, అతని భార్య, స్నేహితుడిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు తిరుపతి రూరల్ మండలం, పేరూరు పంచాయతీ, ఎన్టీఆర్ కాలనీలో నివాసముంటున్న వేమూరు పద్మ, వేముల వెంకటస్వామికి నలుగురు కుమారులు. అందులో రెండోవాడైన సతీష్ ఎంఏ పూర్తి చేసి సంగీతం క్లాసులు చెప్పేవాడు. అతనికి మూడు సంవత్సరాల క్రితం చిత్తూరు జిల్లా, యాదమరి మండలం, కొత్తపల్లి గ్రామానికి చెందిన దుర్గతో వివాహం జరిగింది. వారికి సంతానం లేరు. సతీష్‌కు క్షుద్ర పూజలు చేసే విజయ్‌తో పరిచయం ఏర్పడింది. తదుపరి విజయ్, సతీష్, దుర్గ ముగ్గురు కలిసి ఇంటినుండి వెళ్లిపోయారు. ఈ విషయంపై గతంలో పోలీసులకు ఫిర్యాదు అందగా వారిని పిలిపించి విచారించారు. ఆ తర్వాత కూడా వారు ముగ్గురు కదిరిలో విడిగా కలిసి కాపురం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో సతీష్(35) సోమవారం మృతి చెందాడు. సతీష్ భార్య దుర్గ మృత దేహాన్ని తీసుకుని పుట్టింటికి వెళ్లగా, వారు ఒప్పుకోనందన తిరిగి మృత దేహాన్ని పేరూరుకు తీసుకెళ్లారు. అయితే సతీష్ మృతికి భార్య దుర్గ, స్నేహితుడు విజయ్‌లే కారణమని సతీష్ తల్లి వేమూరి పద్మ తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదుపై ఎస్ఐ షేక్‌షావలి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంగళం 'తుడ' క్వార్టర్స్‌లో దొంగతనం

వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): మంగళం, తిరుమల నగర్ గ్రామ పంచాయతీ, తుడా క్వార్టర్స్ ఎల్ఐజి 296 నంబరు ఇంటిలో దొంగలు బంగారం, వెండి, నగదును దోచుకెళ్లిన సంఘటన చోటుచేసుకుంది. బాధితుడు అమర్ రాజా ఉద్యోగి అనిల్ కుమార్ తెలిపిన వివరాల మేరకు సొంత పనిపై హైదరాబాద్‌కు వెళ్లి, తిరిగి మంగళవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా కిటికీకి ఉన్న ఇనుప చువ్వలు కట్ చేసి ఉన్నాయని తెలిపారు. లోనికి వెళ్లి పరిశీలించగా, బంగారు, వెండి నగలు, రూ.20 వేల రూపాయల నగదును దొంగలు దొంగలించికెళ్లినట్టుగా గుర్తించి, పోలీసులకు సమాచారం ఇచ్చామన్నారు. సమాచారం అందుకున్న తిరుచానూరు పోలీసులు దొంగతనం జరిగిన ఇంటిలో వేలిముద్రల సేకరించి, కేసు దర్యాప్తు ప్రారంభించారు. కొద్దిఇ రోజుల ముందు ఇదే తుడా క్వార్టర్స్ లో ఎంఐజి 81 ఇంటి నెంబరు ఇంటిలో నివాసం ఉండే సిమ్స్ సూపరిండెంట్ ఇంట్లో కూడా వారు లేని సమయంలో దొంగతనం జరిగింది.

ప్రక్షాళన దిశగా టిటిడి

'కూటమి' డైరెక్షన్‌లో 'బిఆర్‌నాయుడు' ముద్ర

ప్రజాశక్తి -తిరుపతి బ్యూరో : కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత తిరుమల తిరుపతి దేవస్థానాన్ని ప్రక్షాళన చేయడమే లక్ష్యంగా సిఎం చంద్రబాబు డైరెక్షన్‌లో ఛైర్మన్ బిఆర్‌నాయుడు ముద్రపడేలా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా తిరుమల విజన్ 2047 దిశగా అడుగులు వేస్తున్నారు. కొండపై ఏ చిన్న పొరపాటు జరగకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సమస్య ఏదైనా.. దష్టికి వచ్చిన వెంటనే యాక్షన్‌లోకి దిగుతున్నారు. కొండపై అనధికారికంగా ఉన్న వారిని తిరుపతికి పంపించేస్తున్నారు. ఇక భక్తుల వసతులు, భద్రత విషయంలో టీడీపీ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. స్వర్ణాంధ్ర విజన్ 2047కు అనుగుణంగా తిరుపతిలో ప్రణాళికాబద్ధమైన అభివద్ధి, పర్యావరణ నిర్వహణ, వారసత్వ పరిరక్షణపై దష్టి సారించే ప్రణాళికతో తిరుమల విజన్ 2047 ప్రారంభించింది. తిరుమల అభివద్ధిలో సంప్రదాయాన్ని, ఆధునికతతో సమతుల్యం చేసుకోవాలని సీఎం చంద్రబాబు సూచనల మేరకు.. టీటీడీ లక్ష్యాలను నిర్దేశించుకుంది. పాలకమండలి భేటీలోనూ ఇలాంటి నిర్ణయాలే తీసుకుంది.ప్రసాదాల తయారీలో నాణ్యత, భక్తులకు అందించే సేవలు గతంతో పోలిస్తే మెరుగుపడినట్లు భక్తులు చెబుతున్నారు. తాజాగా ఏడుకొండలవాని ఆస్తులను కాపాడటమే లక్ష్యమని చంద్రబాబు వెల్లడించారు. న్యాయపరమైన కేసులను త్వరితగతిన పరిష్కరించేలా చూడనున్నారు. దేశంలోనే కాకుండా, విదేశాల్లోనూ ఆలయాలను నిర్మించే ఆలోచన ఉందని ప్రకటించారు. ఇందుకుగాను శ్రీవాణి ట్రస్టులానే, మరో ట్రస్టు ఏర్పాటు చేయనున్నట్లు పాలకమండలి సమావేశంలోనూ పేర్కొన్నారు. భక్తుల నుంచి ఏర్పాట్లపై అభిప్రాయాలను సేకరిస్తున్నారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో భద్రత ఏర్పాటుకు.. గతంలో డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా ఆధ్వర్యంలోని బందం సూచనలు చేసింది. ఏఐని ఉపయోగించి సీసీ కెమెరాలకు లింక్ చేస్తామన్నారు. ఆలయ ప్రవేశ మార్గంలోని బయోమెట్రిక్ సమీపంలో.. ఆక్టోపస్ క్విక్ రియాక్షన్ టీమ్ ఛాంబర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వీటిని అమలు చేయడంతో పాటు.. యాంటీ డ్రోన్ సాంకేతికతను అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉంది. వన్యప్రాణుల నుంచి ఎలా రక్షించాలనే అంశంపై కమిటీని వేశారు. ఎలివేటెడ్ ఫుట్‌పాస్, ఓవర్‌పాస్ నిర్మాణంపైనా సమాలోచనలు జరిపారు. దీనిపై ఇంకా కసరత్తు జరుగుతోంది.

30న పాలిసెట్ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: పాలిటెక్నికల్ కళాశాలలో ప్రవేశానికి, పాలిసెట్ ప్రవేశ పరీక్ష ఈ నెల 30 తేదీన నిర్వహించనున్నారని సత్యవేడు పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఉషాదేవి పేర్కొన్నారు. మంగళ వారం పాలీసెట్ ప్రవేశ పరీక్షలు, దరఖాస్తు విధానంపై ఆమె మీడియా సమావేశంలో వివరాలు తెలిపారు.

డాక్టర్ హరిప్రసాద్‌కు ఉత్తమ సేవా పురస్కారం

ప్రజాశక్తి -గూడూరు: సిద్ధు అలర్జీ ఊపిరితిత్తుల హాస్పిటల్ డా.హరిప్రసాద్ ఉత్తమసేవా పురస్కారం అందుకున్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక పురపాలక సంఘంలో నిధుల దుర్వినియోగంపై, మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ శాఖ ఆర్డి విశ్వనాథం, ఎస్సీ మోహన్, డిఈ సుబ్బరాయుడులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిధులు దుర్వినియోగంపై విచారణ చేస్తున్నామని, వాస్తవాలపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు మున్సిపల్ కమిషనర్ మంజునాథ గౌడ పాల్గొన్నారు.

ఆదిశంకర విద్యార్థుల ప్రతిభ



ప్రజాశక్తి - గూడూరు టౌన్: తిరుపతి, ఎస్వీ కాలేజీలో జరిగిన క్రీడల్లో భాగంగా క్రికెట్, కబాడీల్లో గూడరు, ఆదిశంకర విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వీరిని కళాశాల యాజమాన్యం అభినందించి, బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శిల్పి, కళాకారుడు సుందరయ్య మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులు క్రీడల్లో కూడా రాణించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. కళాశాల చైర్మన్ వంకి పెంచలయ్య మాట్లాడుతూ తమ సంస్థ కేవలం విద్యకే కాకుండా, కళలు, క్రీడలు అభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు.

ఒప్పో ఎఫ్29 సిరీస్ మొబైల్ లాంచింగ్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : స్థానిక నగరి వీధిలోని దీరుస్ మొబైల్ గ్యాలరీలో మంగళవారం ఒప్పో ఎఫ్ 29 సిరీస్ మొబైల్ ఫోన్ లాంచింగ్ కార్యక్రమం ఘనంగా జరిగింది. దిరుస్ మొబైల్స్ అదినేత ధీరజ్ కుమార్, ఒప్పో డిస్ట్రిబ్యూటర్ మహేష్ సంయుక్తంగా లాంచ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒప్పో ఎఫ్29 5జీ, ఒప్పో ఎఫ్29 ప్రో 5జీ పేరుతో ఈ స్మార్ట్‌ఫోన్స్‌ను విడుదల చేసిందన్నారు. అన్ని రకాలైన వాతావరణ పరిస్థితులను తట్టుకునే విధంగా ఈ ఫోన్లను ఐపీ68, ఐపీ69 ఫీచర్లు ఈ ఫోన్లో ఉంటాయని అన్నారు. ఈ ఎఫ్29 సిరీస్ స్మార్ట్‌ఫోన్ల ఐపీ ప్రమాణాలను పరీక్షించినట్లు పేర్కొన్నారు. దుమ్ము, ధూళి, అధిక ఉష్ణోగ్రతలను తట్టుకోవటంతో పాటు వర్షంలో తడిచినా, నీటిలో పడినా రక్షణ కల్పించేలా పోన్ల సామర్థ్యం ఉంటుందని అన్నారు.

విద్యార్థినితో స్కూల్ అసిస్టెంట్ అసభ్య ప్రవర్తన.. సస్పెన్షన్

ప్రజాశక్తి - చిల్లకూరు :చిల్లకూరు మండలం, తిక్కవరం ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మధుబాబు విద్యార్థినితో అస్యభ్యంగా ప్రవర్తించగా, బాలిక తల్లిదండ్రులకు తెలిపింది. వారు వచ్చి ఆయనకు దేహశుద్ధిచేసి పోలీసులకు అప్పగించారు. విషయం తిరుపతి జిల్లా డిఈఒ కెవియన్ కుమార్‌కు తెలియడంతో వెంటనే సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

విద్యార్థుల విద్యా వికాసానికి.. విద్యాస్ వికాస్

విద్యాప్రకాష్ రెడ్డి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ : ఇష్టం లేని చదువు కష్టం కాబట్టి, ఇష్టంతో కూడిన చదువు చెప్పడమే మా విద్యాస్ వికాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లక్ష్యమని పాఠశాల వ్యవస్థాపకులు విద్యాప్రకాష్ రెడ్డి తెలిపారు. విద్యార్థుల భవిష్యత్ పాఠశాలలోనే ప్రారంభమవుతుందని మంగళవారం ప్రజాశక్తితో ఆయన వెల్లడించారు. విద్యా రంగంలో 24 సంవత్సరాలు అనుభవంతో పాఠశాల నిర్వహిస్తున్నామన్నారు. విదార్థులకు రాష్ట్రీయ, జాతీయ పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. అనుభవం, అంకిత భావం ఉన్న ఉపాధ్యాయులచే బోధన జరుగుతుందని తెలిపారు. విద్యార్థుల రక్షణార్థం సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉందన్నారు. అబాకస్, స్పీడ్ మ్యాథ్స్, చక్కటి చేతి రాత, ప్రైమరీ చిన్నారులకు ఇంటిగ్రేటెడ్ కరిక్యులమ్‌తో విద్యా బోధన ఉంటుందని తెలిపారు. సువిశాలమైన 2 ఎకరాల విస్తీర్ణంలో పాఠశాల క్యాంపస్ ఆహ్లాదకరమైన వాతావరణాన్ని విద్యార్థులకు అందిస్తుందన్నారు. కేవలం విద్యా బోధనే కాక, ఇండోర్, అవుట్ డోర్ గేమ్స్‌లో విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామన్నారు. ఎప్పటికప్పుడు తల్లిదండ్రులకు విద్యార్థుల హాజరు, మార్కుల జాబితా పంపుతూ వారి అభిమానం చూరగొన్నామని తెలిపారు. పిల్లల భవిష్యత్తు వెలుగులతో నింపేందుకు విద్యాస్ వికాస్ సదా కృషి చేస్తుందని తెలిపారు.

నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో విశ్వం విద్యార్థుల విజయకేతనం

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ స్థాయిలో 2025-2026 విద్యా సంవత్సరానికి జరిగిన జవహర్ నవోదయ విద్యాలయ పరీక్ష ఫలితాల్లో విక్రమ్, గోపిక, జీవన్ సాయి రెడ్డి, శరత్ చంద్ర ,నవదీప్ యాదవ్, జాహ్నవి, జస్వంత్, మిథున్ మిహాల్,నితీష్ సాయి,సోహిని, అభ్యుదయి తదితరులతో పాటు 37 మంది విశ్వం విద్యార్థులు సీట్లు సాధించారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగ ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను విశ్వం విద్యా సంస్థల అధినేత ఎన్.విశ్వనాథ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వ చందన్ రెడ్డి, కరస్పాండెంట్ ఎన్.తులసీ విశ్వనాథ్‌లు విద్యార్థులను అభినందించారు. విశ్వనాథ రెడ్డి మాట్లాడుతూ గత 35 సంవత్సరాలుగా జాతియ స్థాయిలో జరిగే సైనిక్, నవోదయ, మిలిటరీ స్కూల్స్ వంటి పోటీ పరీక్షలకు తమ సంస్థలో శిక్షణ ఇస్తూ జాతీయ స్థాయిలో ఉత్తమ ఫలితాలతో పాటు అత్యుత్తమ మార్కులు, ర్యాంకులను విశ్వం విద్యార్థులు సాధిస్తునట్లు వివరించారు. సైనిక, నవోదయ, మిలిటరీ స్కూల్సు, స్కూల్స్ వంటి ప్రవేశ పరీక్షల్లో తిరుపతిలోని ఉన్నతమైన ఏకైక శిక్షణా సంస్థగా విశ్వం విద్యా సంస్థలు పేరెన్నిగన్నవని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I DEVARLA NIRMALA (Old Name) W/o **KAKULARAM KUMAR REDDY** R/o D.No. 18/5/363, Yosoda Nagar, Tirupathi Urban Mandal, Tirupathi Dist-517501, A.P. I changed my name to **DEVARALA NIRMALA,** henceforth, I will be known as **DEVARALA NIRMALA.**

మహారాజరాజశ్రీ తిరుపతి అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులు
E.A.No.19/2025, O.E.P.No.116/2022
O.S.No.782/2021

T.Geetha ...D.Hr
V/s
P.Rathnamma (died)
W/o P.Venkatarao, D.No. 20-1-469/A-11, Maruthi Nagar, Korlagunta, Tirupati.
...J.Dr

బహిరంగ ప్రకటన

పై నెంబరు కేసులో తుమ్మలగీత అను ఆమె తనకు రావలసిన బాకీ వసూలు నిమిత్తం ప్రతివాది (J.Dr) కు సంబంధపడిన ఇల్లును జప్తు చేసి ఉంటున్నారు. సదరు J.Dr అయిన పి.రత్నమ్మ అను అమె చనిపోయినది. సదరు రత్నమ్మకు ఎవరైనా వారసులు ఉన్న ఎడల తేది. 30.04.2025 నాడు వాయిదా ఉంటున్నది. సదరు వాయిదా తేదీన నేరుగానైనా లేదా వకీలు ద్వారానైనా పై కోర్టులో ఉదయం 10.30 గం॥ల హాజరు అయి ఆక్షేపణలున్న ఎడల తెల్పుకోవాలసినది లేనిఎడల సదరు కేసును పరోక్షముగా తీర్మానించబడును.

వాయిదా తేది. 30.04.2025

చంద్రగిరి ఎల్లయ్య,
డిక్రీదారుని న్యాయవాది, తిరుపతి. సెల్: 9441394006

గ్రామ పంచాయితీ కార్యాలయము, వెంకటాపురం.

రిక.నెం.01/2025 తేది:24-03-2025

టెండరు ప్రకటన

తిరుపతి జిల్లా, రేణిగుంట మండలము, వెంకటాపురం గ్రామ పంచాయితీ కి 2025-26 వ సంవత్సరమునకు అనగా తేది. 01.04.2025 నుండి 31-03-2026 వరకు గల కాలమునకు దిగువ అనెగ్జరులో తెలిపిన పరికరములు సప్లై చేయుటకు ఆధీకృత డీలర్ల నుండి షీల్డు టెండర్లు కోరబడుతున్నది. సదరు టెండర్ల యందు పాల్గొను వారు దిగువ తెలిపిన విధముగా టెండరు డిపాజిట్లు చెల్లించి టెండర్లు తేది: 29.03.2025 ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 3.00 గంటలలోగా సమర్పించవలయును. పొందుటకై గ్రామ పంచాయతీ కార్యాలయము నందు సంప్రదించగలరు.రాబడిన టెండర్లను అదే రోజు మధ్యాహ్నం 3.15 గంటలకు టెండరుదారుల సమక్షములో తెరువబడును.

మిగతా వివరములు కార్యాలయ పనివేళలు/ పనిదినములందు వచ్చి తెలుసుకొనవచ్చును.

వ.నెం	సప్లై చేయవలసిన వాటి వివరములు	టెండరు ధరావత్తు రూ.
1.	రక్షిత నీటి సరఫరా పరికరములు సప్లై చేయుట(ఐఎస్ఐ)	10,000/-
2.	ప్రజారోగ్య పరికరములు సప్లై చేయుట (ఐఎస్ఐ)	10,000/-
3.	సబ్‌మెర్సిబుల్ మోటార్లు రీవైండింగ్ మరియు పంపు రిపేర్లు చేయుటకు	5,000/-
4.	విద్యుత్ విడి పరికరములు సప్లై చేయుట (ఐఎస్ఐ)	10,000/-

షరతులు : 1. టెండరు షెడ్యూలు రూ.లు 500.00లు చెల్లించి పొందవలెను. 2. టెండరు దరావత్తు పంచాయతీ కార్యదర్శి వెంకటాపురం గ్రామపంచాయతీ పేరిట డిమాండు డ్రాఫ్టు రూపములో చెల్లించవలెను. 3. ఎ.పి.జి.యస్.టి/జి.యస్.టి. రిజిస్ట్రేషన్ కలిగినవారు మాత్రమే టెండర్ల యందు పాల్గొనవలెను. 4. ఎటువంటి కారణములు తెలుపకనే టెండర్లను రద్దు చేయుటకు/ వేరొక తేదికి వాయిదా వేయుటకు కార్యదర్శి పూర్తి అధికారము కలిగియున్నారు. 5. గ్రామ పంచాయతి ఆర్థిక పరిస్థితులను బట్టి బిల్లులు చెల్లించబడును. 6. టెండరు రేట్లు మార్కెటు రేట్లకు లోబడి వుండవలెను.

సం/- **కె.హరి**
పంచాయితీ కార్యదర్శి
గ్రామపంచాయితీ వెంకటాపురం
రేణిగుంట మండలం.

సం/- **ఎం.సుశీల**
సర్పంచ్,
గ్రామపంచాయితీ వెంకటాపురం
రేణిగుంట మండలం.

గ్రామ పంచాయితీ కార్యాలయము, తూకివాకం

రిక.నెం.18/2025 తేది:22-03-2025

టెండరు ప్రకటన

తిరుపతి జిల్లా, రేణిగుంట మండలము, తూకివాకం గ్రామ పంచాయితీ కి 2025-26 వ సంవత్సరమునకు అనగా తేది. 01.04.2025 నుండి 31-03-2026 వరకు గల కాలమునకు దిగువ అనెగ్జరులో తెలిపిన పరికరములు సప్లై చేయుటకు ఆధీకృత డీలర్ల నుండి షీల్డు టెండర్లు కోరబడుతున్నది. సదరు టెండర్ల యందు పాల్గొను వారు దిగువ తెలిపిన విధముగా టెండరు డిపాజిట్లు చెల్లించి టెండర్లు తేది: 28.03.2025 ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 3.00 గంటలలోగా సమర్పించవలయును. పొందుటకై గ్రామ పంచాయతీ కార్యాలయము నందు సంప్రదించగలరు.రాబడిన టెండర్లను అదే రోజు మధ్యాహ్నం 3.15 గంటలకు టెండరుదారుల సమక్షములో తెరువబడును.

మిగతా వివరములు కార్యాలయ పనివేళలు/ పనిదినములందు వచ్చి తెలుసుకొనవచ్చును.

వ.నెం	సప్లై చేయవలసిన వాటి వివరములు	టెండరు ధరావత్తు రూ.
1.	రక్షిత నీటి సరఫరా పరికరములు సప్లై చేయుట(ఐఎస్ఐ)	10,000/-
2.	ప్రజారోగ్య పరికరములు సప్లై చేయుట (ఐఎస్ఐ)	10,000/-
3.	సబ్‌మెర్సిబుల్ మోటార్లు రీవైండింగ్ మరియు పంపు రిపేర్లు చేయుటకు	5,000/-
4.	విద్యుత్ విడి పరికరములు సప్లై చేయుట (ఐఎస్ఐ)	10,000/-

షరతులు : 1. టెండరు షెడ్యూలు రూ.లు 500.00లు చెల్లించి పొందవలెను. 2. టెండరు దరావత్తు పంచాయతీ కార్యదర్శి తూకివాకం గ్రామపంచాయతీ పేరిట డిమాండు డ్రాఫ్టు రూపములో చెల్లించవలెను. 3. ఎ.పి.జి.యస్.టి/జి.యస్.టి. రిజిస్ట్రేషన్ కలిగినవారు మాత్రమే టెండర్ల యందు పాల్గొనవలెను. 4. ఎటువంటి కారణములు తెలుపకనే టెండర్లను రద్దు చేయుటకు/ వేరొక తేదికి వాయిదా వేయుటకు కార్యదర్శి పూర్తి అధికారము కలిగియున్నారు. 5. గ్రామ పంచాయతి ఆర్థిక పరిస్థితులను బట్టి బిల్లులు చెల్లించబడును. 6. టెండరు రేట్లు మార్కెటు రేట్లకు లోబడి వుండవలెను.

సం/- **పి.బాలాజీ**
పంచాయితీ కార్యదర్శి
గ్రామపంచాయితీ తూకివాకం
రేణిగుంట మండలం.

సం/- **యస్.మునిశేఖర్ రెడ్డి**
సర్పంచ్,
గ్రామపంచాయితీ తూకివాకం
రేణిగుంట మండలం.

సప్తవర్ణ శోభితం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి పుష్పయాగం

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి) :శ్రీనివాస మంగాపురం, శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం పుష్పయాగ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం 7 నుండి 10 గంటల వరకు యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 10 నుండి 11 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంలతో అభిషేకం చేశారు. మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు పుష్పయాగం కన్నులపండుగగా నిర్వహించారు. 12 రకాల పుష్పాలు, 6 రకాల ఆకులతో శ్రీ కళ్యాణ వెంకన్నకు పుష్పయాగాన్ని నిర్వహించారు. చామంతి, రోజాలు, గన్నేరు, సంపంగి, మల్లెలు, రుక్షి, కనకాంబరాలు, తామర, కలువ, మొగలిరేకులు, మాను సంపంగి పుష్పాలు, తులసి, దవనం, మరవం, బిల్వం, పన్నీరాకు వంటి ఆకులను ఉపయోగించారు. పుష్పయాగానికి 4 టన్నుల పుష్పాలను దాతలు విరాళంగా అందించారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి పుష్పాలు విరాళంగా అందాయి. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు సుచిత్ర ఎల్ల, ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో వరలక్ష్మి, గార్డెన్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, గార్డెన్ మేనేజర్ జనార్దన్ రెడ్డి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రమేష్, రాజ్‌కుమార్, ఆలయ అర్చకులు బాలాజి రంగాచార్యులు, టెంపుల్ ఇన్స్పెక్టర్ ధనశేఖర్, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విడతల వారీగా గ్రామాలకు అంతర్గత రోడ్ల నిర్మాణం

ప్రజాశక్తి -దొరవారిసత్రం : కూటమి ప్రభుత్వ పాలనలో నియోజక వర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో విడతల వారీగా అంతర్గత రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించడం జరుగుతుందని సూళ్లూరు పేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. ఆమె దొరవారిసత్రం మండల పరిధిలోని కుప్పారెడ్డిపాలెంలో పూర్తయిన సిసి రోడ్డు, 4 గోశాలల శిలా ఫలకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడు లక్షల రూపాయలతో సిమెంట్ రోడ్డు, 10 లక్షల 10 వేల రూపాయలతో నాలుగు గోశాలల నిర్మాణాలను ప్రారంభించి లబ్ధిదారులకు అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుమూరు సుధాకర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు వేమసాని శ్రీనివాసు నాయుడు, ఎస్సీ సెల్ అధ్యక్షులు జకరయ్య, మైనార్టీ నాయకులు షబ్బీర్, పార్టీ నేతలు శ్రీహరి రెడ్డి, మనోహర్ రెడ్డి, విజయ్, నాగేంద్ర నాయుడు, ఉదయ్ కుమార్ గోపాల్ రెడ్డి, బాబునాయుడు ప్రమీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏసీ డీల్స్‌పై ఫ్లిప్‌కార్ట్ నూతన ప్రచారం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : స్వదేశీ ఇ కామర్స్ ప్లాట్‌ఫామ్ ఫ్లిప్‌కార్ట్ తీవ్రమైన వేసవి వేడిని ఎదుర్కోవడానికి సాటిలేని ఆఫర్‌లను మిళితం చేసి 'ఏసి డీల్స్ సో గుడ్, ఇండియా రహేగా కూల్' అనే కొత్త ప్రచారాన్ని ప్రారంభించింది. 22 ఫీట్ ట్రైబల్ వరల్డ్‌వైడ్ ఆధ్వర్యంలో ఫ్లిప్‌కార్ట్ ప్రచారం రూపొందించినట్టు ఫ్లిప్‌కార్ట్ మీడియా విభాగ హెడ్ ప్రతీక్ శెట్టి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ వేసవి తాపాన్ని తగ్గించే ఉపకరణాలను పరిచయం చేస్తున్నామని తెలిపారు. ఈ ప్రచారం మార్చి 26 నుంచి 31 వరకు జరిగే ఫ్లిప్‌కార్ట్ కూలింగ్ డేస్‌తో పాటుగా జరుగుతుందన్నారు. ఈ ప్రచారంలో భాగంగా రూ. 26,490 నుండి ప్రారంభమయ్యే ఎయిర్ కండిషనర్లు, రూ.1,999 నుండి ప్రారంభమయ్యే విద్యుత్ ఆదా చేసే ఫ్యాన్‌లు రూ. 3,999 నుండి ప్రారంభమయ్యే కూలర్‌ల వంటి ఉత్పత్తులను అందిస్తున్నామన్నారు. ఆకర్షణీయమైన ఎక్స్ఛేంజ్ ఆఫర్లు, సౌకర్యవంతమైన చెల్లింపు అవకాశాలతోపాటు, మంచి బ్రాండెడ్ ఉపకరణాలు అందిస్తామని తెలిపారు. 22 ఫీట్ ట్రైబల్ వరల్డ్‌వైడ్, ఎన్‌సిడి విష్ణు శ్రీవాత్సవ్ మాట్లాడుతూ ఫ్లిప్ కార్డ్ అందించే ఆఫర్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రిజర్వేషన్లలో సమన్యాయం జరిగేలా చూడాలి

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): ఎస్సీ వర్గీకరణ నేపథ్యంలో మాల, మాదిగల సామాజిక వర్గానికి చెందిన వారికి సమన్యాయం జరిగేలాగా ప్రభుత్వాలు కృషి చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఎమ్మార్పీఎస్ దండోరా జాతీయ అధ్యక్షులు ప్రకాష్ మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజర్వేషన్ల ఫలాలను సమంగా అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జాతీయ లీగల్ సెల్ అధ్యక్షులు గుడిమల్లం గిరిధర్ మాదిగ, కిష్టన్న, గంధం శ్రీనివాస్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

మాకు రాజకీయ ప్రాధాన్యం కల్పించండి: మల్లికార్జున

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): రాష్ట్రవ్యాప్తంగా గిరిజన తెగకు చెందిన 34 కులాలలో 37 లక్షలకు పైగా ఎనిమిది జిల్లాలకు విస్తరించి ఉన్న యానాదులకు రాజకీయ ప్రాధాన్యం కల్పిస్తూ, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని యానాది సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసి పెంచలయ్య పిలుపు మేరకు ఎస్టీ వర్గీకరణ బేరి సభను నిర్వహిస్తున్నామని యానాదుల సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షులు తలపల చెంచు మల్లికార్జున రావు తెలిపారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 14వ తేదీన ఎస్టీ వర్గీకరణ బేరి సభను నెల్లూరు జిల్లా కేంద్రంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్టీ ఉద్యోగ సంఘాల నాయకులకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎస్టీ ఉద్యోగస్థుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు శ్రీమంతుల రామయ్య, వెంకటరత్నం, చంగల్రాయలు, వెంకటరమణ, వసంతమ్మ, నాగరాణి, జ్యోతి పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి నియోజకవర్గంలోని ఇద్దరికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అందించారు. మంగళవారం తన నివాసంలో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. 42వ డివిజన్ పరిధిలోని శాంతినగర్‌కు చెందిన సత్యనారాయణకు మూడు లక్షలా యాభై మూడు వేల రూపాయల చెక్కు, 9వ డివిజన్ పరిధిలోని సంజయ్ గాంధీ కాలనీకి చెందిన మునిబాలకు చెందిన చెక్కును ఆయన తల్లికి అందించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు రాజా రెడ్డి, మహేష్ యాదవ్, కెఎంకె లోకేష్, బత్తెన మధు, రుద్రకిషోర్, శిరీష, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

తుడా ప్లాట్స్ నిర్మాణాలు వేగవంతం చేయండి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్:తిరుపతి, అన్నమయ్య కూడలి వద్ద నిర్మిస్తున్న తుడా టవర్స్ అమ్మకాలు వేగవంతం చేయాలని ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. తుడా ప్లాట్స్ అమ్మకాలు తదితర అంశాలపై మంగళవారం తుడా కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షులు మాట్లాడుతూ తుడా టవర్స్‌కు వేలం పాట నిర్వహించగా విశేష స్పందన లభించిందన్నారు. టవర్స్ నిర్మాణ పనుల్లో ఆలస్యం అవుతోందని, పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలోఎస్సీ కృష్ణారెడ్డి ఈఈ రవీంద్ర, అధికారులు పాల్గొన్నారు.

రేపు ఆర్‌సి పురంలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ బహిరంగ సభ

ప్రజాశక్తి - రామచంద్రపురం : మండలంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలలో చేసిన ఉపాధి హామీ పనులను 18వ విడత సామాజిక తనిఖీ రేపు చేపట్టనున్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఇందిరమ్మ తెలిపారు. ఉపాధి హామీ పనులను తనిఖీ చేసి జరిగిన అక్రమాలను తనిఖీ బృందం వెల్లడించనుంది. ఈ ఉపాధి హామీ బహిరంగ సభకు డ్వామా పథక సంచాలకులు శ్రీనివాస్ ప్రసాద్, మండల ప్రజా ప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు.

ఆస్తి పన్ను 31 లోపు చెల్లిస్తే వడ్డీలో 50% రాయితీ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్:తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో ఇంటిపన్నులు, ఖాళీ జాగా పన్నుల చెల్లిపుపై 50 శాతం వడ్డీ మినహాయింపు ఇస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు.సెలవు రోజుల్లో కూడా కౌంటర్ ఉంటుందని తెలిపారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : 2024-25 ఆర్థిక సంవత్సరానికి చెల్లించాల్సిన ఆస్థి పన్ను, 31 తేదీలోగా చెల్లిస్తే వడ్డీపై 50% రాయితీ ఇవ్వడం జరుగుతుందని, పుత్తూరు పురపాలక సంఘ కమిషనర్ మంజునాథ గౌడ మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు.

జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ఘనంగా వార్షికోత్సవం

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం 2024-25 వ సంవత్సరానికి సంబంధించిన వార్షిక మహోత్సవాన్ని విశ్వవిద్యాలయం ప్రొ.ఎస్.బి రఘునాథాచార్య ఓపెన్ ఆడిటోరియంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిఆర్డిఓ బెంగళూరు సిఇఎమ్ఐఎల్ఎసి ప్రఖ్యాత శాస్త్రజ్ఞులు ఎల్ఎన్.రాఘవేంద్ర హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అకాడమిక్ డీన్ ప్రొ.రజనీకాంత్ శుక్ల, ప్రొ.సి.రంగనాథన్, స్టూడెంట్స్ వెల్ఫేర్ ప్రొ.సి.దక్షిణామూర్తి శర్మ, కోఆర్డినేటర్ సి.హెచ్.నాగరాజు, అడిషనల్ కోఆర్డినేటర్ డా.ఉదయన హెగ్డే, కల్చరల్ కోఆర్డినేటర్ డా.లీనాచంద్ర, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ వి.సేతురాం, సభా సంచాలకులు డా.ఎస్.వైష్ణవి, విభిన్న విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

రైతు గుర్తింపు కార్డుతోనే పథకాలకు అర్హత

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కలిసి రాష్ట్రంలో ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య (కార్డు) ఇవ్వాలని రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టారని, వడమాల పేట మండల వ్యవసాయ అధికారి ఏ.విజయ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని ప్రతి రైతు పీఎం కిసాన్ లబ్ధిదారులుగా కొనసాగాలంటే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ప్రతి రైతుకు గుర్తింపు సంఖ్యను జారీ చేస్తున్నామని మండల వ్యవసాయాధికారి భారతి తెలిపారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - తిరుపతి సిటి: తిరుపతి ఈస్ట్ సెక్షన్‌లో 33/11 కె.వి. దొడ్డ పురం ఫీడర్‌లో ఇంటర్ లింక్ విద్యుత్ లైన్లను తొలగించుటకు, నిర్వహణకు ఈ రోజు ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపిఎస్పిడిసిఎల్ ఆపరేషన్ టౌన్ డివిజన్ విద్యుత్ ఈ.ఈ.విన్నకోటిచంద్ర శేఖర్ రావ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున కె.కె. లేఔట్ , మిట్ట విధి, నాథముని విధి, యాదవ విధి, ఆకుతోట విధి, ఆర్.ఎస్. జంక్షన్, పొర్ల విధి, రెడ్డి అండ్ రెడ్డి కాలని, దొడ్డాపురం వీధి, పంట వీధి తదితర ప్రాంతాల వినియోగ దారులు సహకరించాలని కోరారు.

నరసింహ యాదవ్ ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు

ప్రజాశక్తి - తిరుపతి : యాదవ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా గొల్ల నరసింహ యాదవ్ ప్రమాణ స్వీకారోత్సవానికి బీసీ కులాల సన్నాహక సమావేశం టీడీపీ కార్యాలయంలో ఈరోజు సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి రజక సంఘం, గాండ్ల సంఘం, యాదవ సంఘం, నాయి బ్రాహ్మణ సంఘం, మత్స్యకారుల సంఘం, వడ్డెర సంఘం మొదలగు వివిధ సంఘాల నాయకులు హాజరై ప్రమాణ స్వీకారం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పాపవినాశనంలో తనిఖీలు చేశాం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుమల పాపవినాశనం డ్యామ్‌లో పడవలతో తనిఖీలు చేశామని, బోటింగ్‌పై జిల్లా అటవీశాఖ అధికారి పి.వివేక్ స్పష్టత ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిఘాకోసం బోటింగ్ చేశామన్నారు.

పంచాయతి షాపింగ్ గదులు వేలం పాట

ప్రజాశక్తి - నాగలాపురం: గ్రామ పంచాయతీ పరిధిలో 2025-26 సంవత్సరానికి సంబంధించి షాపింగ్ గదులను, రేపు పంచాయతి కార్యాలయంలో వారపు సంత మొదలగు వాటికి వేలం పాట నిర్వహిస్తున్నట్లు పంచాయతి కార్యదర్శి రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అన్నదానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, త్యాగరాజ వీధిలో కొలువై ఉన్న శ్రీ కళ్యాణ వీరభద్ర స్వామి దేవస్థానంలో మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది.

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, ప్రగతి సేవ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఓం శ్రీ సాయిరాం చారిటబుల్ వృద్ధాశ్రమములో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సహస్ర జన్మ దినం సందర్భంగా వారి తల్లి దండ్రులు మౌనిక, శ్రీనులు ఈ కార్యక్రమానికి దాతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సభ్యులు కాటూరి శ్రీనివాసులు, రాము, కె.ఆర్.ఎం, పెంచలయ్య, నాగరాజు, యశ్వంత్, ముని, ప్రసాద్, కృష్ణా రెడ్డి, నాగేంద్ర, కల్యాణి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతి రాయల్ నగర్ తెలుగు గంగ ట్యాంక్ పక్కన వెలిసి ఉన్న సోమేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం పేదలకు అన్నదానం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు వెంకటరమణ ఎనిమిదవ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి 12వ డివిజన్ కార్పోరేటర్ ఎస్ కె బాబు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షురాలు కె.కుమారి, మునిక్రిష్ణా రెడ్డి, బాలక్రిష్ణా రెడ్డి ఎస్.కే.బాబు మిత్రులు ఉదయగిరి భాస్కర్, హనుమంత్ రెడ్డి పాల్గొన్నారు.

దివ్యరామం ఉదయం 6 గంటలకు తెరవాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: దివ్యరామం పచ్చని చెట్లతో ప్రకృతి ఒడిలో వాకింగ్ చేయడం వలన ఆహ్లాదంగా ఉండడంతో తిరుపతి ప్రాంతంలో నివసించే వారు ఎక్కువమంది వాకర్స్ ఆరోగ్య పరిరక్షణలో భాగంగా వాకింగ్, యోగ, షటిల్ వంటి చేస్తూ ఉంటారు. కానీ పులి, ఎలుగు బంటి సంచరిస్తున్నదనే కారణంగా టైమింగ్ మార్చడంతో అనేక ఇబ్బందులు గురు అవుతున్నారు.ఉదయం 7:30 గంటల నుండి 9:30 గంటల వరకు వాకర్స్‌ను అనుమతిస్తామని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే ఈ సమయం అందరూ కూడా తమ తమ పనుల్లో వెళ్లడానికి ఇబ్బందిని కలిగిస్తుందని, మహిళలు వంట చేసి పిల్లల్ని స్కూల్ పంపించడం, పిల్లలు పరీక్షల వున్నాయి.అనంతరం ఉద్యోగాలు చేసుకోవడం వంటి ఉంటాయని తెలియజేశారు. అనంతరం వాకర్స్ అందరూ ఉదయం ఆరు గంటలకే దివ్యారామం ఓపెన్ చేయాలని నిరసన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది.

యునైటెడ్ స్టేట్స్-ఇండియా ఎడ్యుకేషనల్ ఫౌండేషన్‌తో ఎస్వీయు సహకార ఒప్పందం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం యునైటెడ్ స్టేట్స్ ఇండియా ఎడ్యుకేషనల్ ఫౌండేషన్‌తో అవగాహన ఒప్పందం చేసుకునేందుకు మంగళవారం విసి చాంబర్లో ఇన్చార్జి విసి ఆచార్య అప్పారావుతో ఫౌండేషన్ అధికారులు చర్చలు జరిపారు. ఇందులో భాగంగా ఎస్వియూతో బోధన, పరిశోధనా కార్యక్రమాలు, అవగాహన సదస్సులు, నూతన ఆవిష్కరణలు, కమ్యూనిటీ ఎంగేజ్మెంట్ వంటి కార్యక్రమాలను నిర్వహించేందుకు విద్యార్థుల పరస్పర సహకారం అందించుకునేందుకు ఉన్నటువంటి అవకాశాలను చర్చించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ ఎంగేజ్‌మెంట్ కోసం పబ్లిక్ డిప్లమసీ ఆఫీసర్, కాన్సులేట్ జనరల్, హైదరాబాద్ ఎమిలియా బి. స్మిత్, సంథిల్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.భూపతినాయుడు, రూసా కోఆర్డినేటర్లు రమశ్రీ, ఉషా రెడ్డి, డీన్ ఇంటర్నేషనల్ అఫైర్స్ కిషోర్ ఆర్ అండ్ డి డీన్ నర్సింహ, ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ కె.సుధారాణి, ప్రిన్సిపల్, వైస్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ సుబ్బారావు, సైన్స్ కళాశాల కెమిస్ట్రీ ప్రొఫెసర్ సురేష్, రూసా సిఇఒ వంశీకృష్ణ రాయల పాల్గొన్నారు.

వినతులు స్వీకరణ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల ప్రజలు గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్‌ను కలిసి తమ సమస్యలను తెలియజేశారు. సమస్యలపై ఎమ్మెల్యే అధికారులతో ఫోన్లో మాట్లాడి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని మండల విద్యా శాఖ అధికారి ముని సుబ్రహ్మణ్యం తెలియజేశారు. మండలంలోని వేణుగోపాలపురం పాఠశాల, నెలవాయి బుచ్చినాయుడు కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నిండి కండ్రిగ పాఠశాల, నీర్పకోట వైసి పాఠశాలల్లో ఆయన సోమవారం తనిఖీ చేపట్టారు. పాఠశాల రికార్డులను పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.